సాక్షి ఒడిశా
శనివారం । 30 । ఆగస్టు । 2025



హుండీ ఆదాయం
నగదు : రూ. 5,34,479
బంగారం : 1 గ్రాము 750 మిల్లీ గ్రాములు
వెండి : 30 గ్రాముల 500 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



గణపతికి ఘనంగా పూజలు
గణపతికి ఘనంగా పూజలు జరుగుతున్నాయి. మండపాలు మెరిసిపోతున్నాయి. - 8లో



పల్లెల్లో నువాఖాయ్ వేడుక
పల్లెల్లో నువాఖాయ్ వేడుక జరిగింది. ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. - 8లో

న్యూస్‌రీల్

3న శ్రీమందిరం పాలక మండలి సమావేశం

భువనేశ్వర్: పూరీ శ్రీ మందిరం పాలక మండలి సమావేశం సెప్టెంబర్ మూడో తేదీన జరుగుతుంది. ఇది కొత్తగా ఏర్పడిన పాలక మండలి తొలి సమావేశం విశేషం. పూరీ గజపతి మహారాజా దివ్య సింగ్ దేవ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నారు. సమావేశంలో కొత్త పాలక మండలి సభ్యులను స్వాగతించి, కొత్త ఉప కమిటీలను ఏర్పాటు చేస్తారు.

వర్షాలకు జయపురంలో భారీ నష్టం



వర్షాలకు గోడ కూలిన ఇంటి గోడ

జయపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జయపురంలో భారీ నష్టం వాటిల్లిందని అధికారులు తెలియజేశారు. మొత్తం 28 ఇళ్లు పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్నట్లు వెల్లడించారు. నష్టపోయిన కుటుంబాలకు సాయం అందించి ఆదుకోవాలని జయపురం తహసీల్దార్ సవ్యసాచి జెన రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. అలాగే ఇళ్ల నష్టం జరిగిన ప్రాంతాలను అధికారులు సందర్శించి అంచనా వేస్తున్నారు. బాధితులకు సాయం అందజేయనున్నట్లు తెలియజేశారు.

యువ న్యాయవాది ఆత్మహత్య



దీపక్ కుమార్ సాహు(ఫైల్)

భువనేశ్వర్: నగరం శివార్లు పందర ప్రాంతంలో ఉంటున్న యువ న్యాయవాది ఆత్మాహుతిలో దహనం అయ్యాడు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపింది. గురువారం అర్ధరాత్రి ఈ విచారకర సంఘటన జరిగింది. మంటల్లో ఆహుతి అయి ప్రాణాలు కోల్పోయిన న్యాయవాది 46 సంవత్సరాల దీపక్ కుమార్ సాహుగా గుర్తించారు. ఈ ప్రాంతంలో ఆయన సివిల్ న్యాయవాదిగా సుపరిచితులు. పెట్రోల్ పోసుకుని తనకు తాను నిప్పంటించుకున్నట్లు భావిస్తున్నారు. ఘటనా స్థలంలో ఖాళీ పెట్రోలు సీసాను పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనపరచుకుని పంచనామా కోసం స్థానిక క్యాపిటలు ఆస్పత్రికి తరలించారు. ఇంటి డాబాపైనే దీపక్ కుమార్ సాహు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు.

గంజాయి పట్టివేత

జయపురం: జయపురం మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు వెళ్లే ప్రభుత్వ బస్సులో పట్టణ పోలీసులు 5 కేజీల గంజాయి పట్టుకున్నారు. బస్సులో ఒక బ్యాగ్ ఉందని వచ్చిన సమాచారం మేరకు పోలీసులు బస్టాండ్‌కు వెళ్లి బ్యాగ్‌ను తనిఖీ చేయగా అందులో ఒక ప్యాంట్, షర్టుతో పాటు గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం సాయంత్రం జయపురం ప్రభుత్వ బస్టాండ్‌లో విజయవాడ వెళ్లనున్న బస్సులో బ్యాగ్ పడిఉంది. దీనిని ఒక మహిళా ప్రయాణికురాలు తెరిచి చూడగా అందులో గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించింది. దీంతో పోలీసులు సమాచారం అందించగా, పోలీసులు వెళ్లి స్వాధీనం చేసుకున్నారని పట్టణ పోలీసు అధికారి ఉల్లాస చంద్రరౌత్ తెలియజేశారు. సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా దర్యాప్తు జరుపుతున్నామని వెల్లడించారు. ఇంతకీ ఆ బ్యాగ్ ఎవరు విడిచిపెట్టారు అనేది తెలియాల్సి ఉంది.

ఆలయంలో అగ్నిప్రమాదం

భువనేశ్వర్: పూరీ జిల్లా బ్రహ్మగిరి పోలీస్ ఠాణా పరిధి కంద్‌గోడ గ్రామంలోని ఒక ఆలయంలో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఆలయంలో నిత్య పూజలందుకుంటున్న జగన్నాథుడు, ఆయన తోబుట్టువులు బలభద్రుడు, దేవి సుభద్ర విగ్రహాలు ధ్వంసమయ్యాయి. ఆలయ అర్చకులు యథాతథంగా గురువారం రాత్రి 8 గంటల ప్రాంతంలో సంధ్యా హారతి, రోజువారీ సంకీర్తన తర్వాత తలుపులు మూసివేశారు. ఆలయ ద్వారాలు మూసి వేసిన సుమారు గంట తర్వాత ఆలయం నుంచి పొగలు కమ్ముతున్నట్లు కొంతమంది దృష్టిలో పడింది. ఈ విషయం ఆలయ అర్చకులకు తెలియడంతో తక్షణమే అర్చక వర్గంతో స్థానికులు ఆలయానికి పరుగెత్తుకుంటూ వచ్చి తలుపు తెరిచిన తర్వాత మంటలను గమనించారు. మంటలను నివారించి పరిశీలించగా అగ్ని ప్రమాదంలో జగన్నాథుడు, బలభద్రుడు, దేవి సుభద్ర విగ్రహాలతో పాటు కొన్ని పూజా సామగ్రి దగ్ధమైనట్లు గుర్తించారు. అగ్ని ప్రమాదానికి కచ్చితమైన కారణం ఇంకా తెలియనప్పటికీ ఆలయం లోపల ఉన్న మట్టి దీపం వల్ల మంటలు చెలరేగి ఉండవచ్చని భావిస్తున్నారు. స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరి విచారణ చేపట్టారు. ఇదిలా ఉండగా కొంతమంది స్థానికులు ఆలయ సేవకుల నిర్లక్ష్యంతో అగ్ని ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ఈ సంఘటన ఆ ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.

ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై సమాలోచనలు



విమానాశ్రయంలో లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాకు స్వాగతించిన రాష్ట్ర శాసన సభ స్పీకరు సురమా పాఢి



ముఖ్యమంత్రితో రాష్ట్ర అతిథి గృహంలో సమావేశమైన లోక్‌సభ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ ఫగ్గన్ సింగ్ కులస్తే, ఇతర కమిటీ సభ్యులు

భువనేశ్వర్: షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమంపై పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీల కమిటీల అధ్యక్షుల జాతీయ సమావేశాన్ని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విచ్చేసిన లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాకు స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర శాసన సభ స్పీకర్ సురమా పాఢి, స్థానిక లోక్ సభ సభ్యురాలు అపరాజిత షడంగి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీ బిర్లా ఒక ప్రదర్శనను ప్రారంభించి, ఒక సావనీర్‌ను కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన లోక్ సభ స్పీకరు షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమం, అభివృద్ధి, సాధికారతలో పార్లమెంటరీ, శాసనసభ కమిటీల పాత్ర శీర్షికతో ఈ సదస్సు వరుసగా 2 రోజులపాటు నిరవధికంగా కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడానికి సంక్షేమ విధానాల అమలులో జవాబుదారీతనం నిర్ధారించడంలో పార్లమెంటరీ, రాష్ట్ర శాసన సభ కమిటీల ముఖ్యమైన పాత్రపై ఈ సదస్సులో లోతుగా చర్చిస్తారని వివరించారు.

షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కమిటీ అధ్యక్షుల మొదటి సమావేశం 1976లో న్యూఢిల్లీలో జరిగింది. తరువాత 1979, 1983, 1987, 2001లో వరుసగా ఈ సమావేశాలు జరిగాయి. ఢిల్లీ వెలుపల ఈ సమావేశం జరగడం ఇదే మొదటిసారి. ఆ అవకాశం రాష్ట్రానికి లభించడం మరో విశేషం. రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడా, కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జుయెల్ ఓరం, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాజ్య సభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్, షెడ్యూల్డ్ కులాలు, తెగల సంక్షేమంపై పార్లమెంటరీ కమిటీ చైర్మన్ డాక్టర్ ఫగ్గన్ సింగ్ కులస్తే ఈ కార్యక్రమానికి హాజరై ప్రముఖులను ఉద్దేశించి ప్రసంగించారు. పార్లమెంట్, రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాల అసెంబ్లీలలో షెడ్యూల్డ్ కులాలు, తెగల సంక్షేమంపై పార్లమెంటరీ కమిటీ చైర్మన్ మరియు సభ్యులు, ఒడిశా ప్రభుత్వ మంత్రులు, ఒడిశా శాసన సభ సభ్యులు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు పార్లమెంటు, రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల అసెంబ్లీల షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కమిటీల అధ్యక్షులు మరియు సభ్యులు సహా 200 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు.



పార్లమెంట్, రాష్ట్ర - కేంద్ర పాలిత ప్రాంతాల శాసన సభల కమిటీల జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో పాల్గొన్న లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా

ఈ నెల 30న రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరి బాబు కంభంపాటి ముగింపు ప్రసంగంతో ఈ సదస్సు ముగుస్తుంది. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సాధికారత కోసం రాజ్యాంగ రక్షణలను బలోపేతం చేయడం, సామాజిక, ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించడం, ఉత్తమ పద్ధతులను అవలంబించడంపై ప్రముఖులు ప్రసంగంలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రతినిధులు, శాసన సభ కమిటీ చైర్మన్, 4 మంది ఎమ్మెల్యేలతో 5 మంది సభ్యులు, ఎస్సీ-ఎస్టీ అభివృద్ధిపై పార్లమెంటరీ కమిటీలోని 30 మంది సభ్యులు హాజరయ్యారు. జాతీయ సదస్సు ఆరంభానికి ముందుగా లోక్‌సభ ఎస్సీ/ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ ఫగ్గన్ సింగ్ కులస్తే మరియు కమిటీ సభ్యులు స్థానిక రాష్ట్ర అతిథి గృహంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీని మర్యాదపూర్వకంగా కలిశారు.



జాతీయ సదస్సు ప్రారంభోత్సవానికి హాజరైన ప్రముఖులతో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

ఎరువుల కోసం రైతుల ఆందోళన



వ్యవసాయ కార్యాలయాన్ని ముట్టడించిన రైతులు



ఆందోళనలో రైతులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి ల్యాంప్ ఎరువుల కోసం రైతులు శుక్రవారం ఆందోళనకు దిగారు. వారం రోజుల క్రితం చేసిన ఆందోళన సందర్భంగా శుక్రవారం ఎరువులను సరఫరా చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో రైతులంతా సంబంధిత కార్యాలయం వద్దకు చేరుకున్నారు అయినప్పటికీ ఎరువులను పంపిణీ చేయకపోవడంతో ఆగ్రహంతో ఆందోళనకు దిగారు. అందుబాటులో 1200 బస్తాల ఎరువు అందుబాటులో ఉన్నప్పటికీ ఇవ్వడం లేదంటూ కదం తొక్కారు. ల్యాంప్ అధికారులు కూడా తమకు స్పష్టత ఇవ్వడం లేదంటూ ఆందోళన చేశారు. పోలీసులు, సమితి అధికారులు రైతులను శాంతింపచేయడానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. సాయంత్రం వరకూ రైతులు రోడ్డుపై బైఠాయించడంతో మలకన్‌గిరి-మత్తిలి రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు.

క్రీడలపై అవగాహన ర్యాలీ



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ కులకర్ణి



జీసీడీ వాకర్స్ క్లబ్ సభ్యులతో కలెక్టర్ కులకర్ణి

రాయగడ: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక సద్భావన స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ అశుతోష్ కులకర్ణి జెండా ఊపి ప్రారంభించారు. క్రీడాకారులకు ప్రభుత్వం సమకూరుస్తున్న సౌకర్యాల గురించి ఈ సందర్భంగా వివరించారు. క్రీడల్లో రాణించాలని క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. ర్యాలీలో క్రీడాకారులు, యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక జీసీడీ వాకర్స్ క్లబ్ సభ్యులతో సమావేశమైన కలెక్టర్ ఆరోగ్యానికి నడక ఎంతో అవసరమన్నారు. దీనిని ఈ క్లబ్ సభ్యులు వివిధ సందర్భాల్లో నడక గురించి చేపడుతున్న చైతన్య, అవగాహన కార్యక్రమాలను ప్రశంసించారు. క్లబ్ అధ్యక్షులు చిన్నారి విజయమోహన్, సభ్యులు కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

బొరిగుమ్మను ఎన్‌ఏసీగా ప్రకటించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొరిగుమ్మను ఈనెల 31వ తేదీలోగా నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్(ఎన్ఏసీ)గా ప్రకటించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ మేరకు బొరిగుమ్మలో శుక్రవారం ఆయన మాట్లాడారు. బీజేడీ హయాంలో దాదాపు ఆ ప్రభుత్వాన్ని 21సార్లు అసెంబ్లీలో ప్రశ్నించడం జరిగిందన్నారు. అనంతరం బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా 5 పర్యాయాలు ప్రశ్నించానని గుర్తు చేశారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం 7 జిల్లాల్లో 12 నోటిఫైడ్ కౌన్సిల్‌లు ప్రకటించిందని, అయితే వాటిలో బొరిగుమ్మను చేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బొరిగుమ్మను ఎన్ఏసీగా ప్రకటించేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆయనతో పాటు బొరిగుమ్మ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ గంతాయిత్, కొరాపుట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ ప్రతినిధి రామచంద్ర పాఢీ, భాను దొర, లాలు గుప్త, నారాయణ సాహు తదితరులు ఉన్నారు.

భువనేశ్వర్ మహిళలకు అత్యంత సురక్షితం



భువనేశ్వర్: భువనేశ్వర్ భారతదేశంలోని మహిళలకు అత్యంత సురక్షితమైన నగరాల్లో ఒకటిగా ఎంపికైంది. జాతీయ వార్షిక నివేదిక, మహిళా భద్రత సూచిక (ఎన్ఏఆర్ఐ - నారి) ఈ ఏడాది విడుదల చేసిన నివేదికలో ఈ విషయం వెల్లడైంది. జాతీయ మహిళా కమిషను ఈ నివేదికని ఆవిష్కరించింది. సురక్షితమైన నగరాల అగ్ర శ్రేణిలో భువనేశ్వర్‌తో పాటు కోహిమా (నాగాలాండ్), విశాఖపట్నం (ఆంధ్రప్రదేశ్), ఐజ్వాల్ (మిజోరాం), గ్యాంగ్‌టాక్ (సిక్కిం), ఇటానగర్ (అరుణాచల్ ప్రదేశ్) ఉన్నాయి. విధాన సంస్కరణలు, అట్టడుగు స్థాయి చొరవల ద్వారా మహిళలకు సురక్షితమైన వాతావరణాలను సృష్టించడంలో ఈ నగరాలు స్థిరమైన మెరుగుదలలను ప్రదర్శించాయి. జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయ కిశోర్ రహత్కర్ విడుదల చేసిన నివేదిక ఈ విషయం పేర్కొంది. మరోవైపు ఈ దిశలో రాంచీ, శ్రీనగర్, కోల్‌కతా, ఢిల్లీ, ఫరీదాబాద్, పాట్నా అత్యల్ప స్కోరు సాధించాయి. 31 నగరాల్లో 12,770 మంది మహిళలపై నిర్వహించిన సర్వే ఆధారంగా దేశవ్యాప్త సూచికని విడుదల చేశారు.

ముగిసిన ఎఫ్‌డీపీ ప్రోగాం



వర్సిటీ సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు, విద్యార్థులు

పర్లాకిమిడి: స్థానిక ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీలో 'రాబోవు తరంలో వైర్‌లెస్ కమ్యూనికేషన్ మరియు హార్వెస్టింగ్ టెక్నాలజీ'పై రెండు వారాల పాటు జరిగిన ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) విజయవంతంగా శుక్రవారంతో ముగిసింది. ఈనెల 18 నుంచి 29 వరకు సదస్సు జరిగింది. ఈ ముగింపు సమావేశానికి సెంచూరియన్ వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డీఎన్ రావు, అకడమిక్ డీన్ డా.ప్రఫుల్ల పండా, రిజిస్ట్రార్ డా.అనితా పాత్రోలు పాల్గొనగా.. ప్రభాత్‌కుమార్ పట్నాయక్, డా.ప్రగ్యా పరిమితా ప్రధాన్‌లు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. వైర్‌లెస్ కమ్యూనికేషన్, యాంటెన్నా డిజైన్, ఆర్‌ఎఫ్ ఎనర్జీ హార్వేస్టింగ్ టెక్నాలజీస్‌లో తాజా పరిజ్ఞానాన్ని అందించడం ద్వారా భవిష్యత్‌కు అవసరమైన సంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికి దోహదపడుతుందని డా.ప్రఫుల్ల పండా అన్నారు. ఒడిశా ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం, ఐసీటీ అకాడమీ, నిట్ సహకారంతో ఈ ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొ.గణపతి పండా, డా.శైలేంద్ర కుమార్ (బిలాయి ఐఐటీ), డా.నిశాంత్ కుమార్ (జోద్‌పూర్ ఐఐటీ), డా.అర్నాబ ఘోష్ (రౌర్కెలా ఐఐటీ), పికాన్ మజుందార్ (మెట్‌లాబ్ నిపుణుడు), డా.రాజేశ్వరీ ప్రధాన్ (బుర్లా వీఎస్ఎస్‌యూటీ) తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగౌరి మందిరానికి మహర్దశ

- రూ.26 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం



భూమి పూజ కార్యక్రమంలో మందిర పరిచాలన కమిటీ సభ్యులు తదితరులు



పూజలందుకుంటున్న మజ్జిగౌరి అమ్మవారు

రాయగడ: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న మజ్జిగౌరి మందిరం రూపురేఖలు మారనున్నాయి. సుమారు రూ.26 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు శుక్రవారం భూమిపూజ జరిగింది. మందిర ప్రధాన అర్చకుడు చంద్రశేఖర్ బెరుకొ, రాజపురోహితుడు బీరంచి నారాయణ దాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో మందిరం మేనేజింగ్ ట్రస్టీ రాయి సింగి బిడిక, సభ్యులు ఇప్పిలి సన్యాసిరాజు, బాబు దలాయి, పెద్దీన వాసుదేవరావు, మందిరం సూపరింటెండెంట్ జానకీ వల్లభ్ మహాంతితో పాటు మందిరాభివృద్ధికి టెండర్లు దక్కించుకున్న బరంపురానికి చెందిన ప్రముఖ కాంట్రాక్ట్ సంస్థ కాసీకంచన్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేతలు పాల్గొన్నారు.



రూపుదిద్దుకోనున్న మందిరం మాస్టర్ ప్లాన్

బీజేడీ హయాంలో నిధులు మంజూరు

మజ్జిగౌరి అమ్మవారి దర్శనం కోసం ఇటు తెలుగు రాష్ట్రాల భక్తులతో పాటు అటు చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక శాతంలో వస్తుంటారు. ప్రతి ఆది, మంగళ, బుధవారాల్లో వీరి సంఖ్య గణనీయంగా ఉంటుంది. కేవలం ఆదివారం నాడు సుమారు 50 వేల నుంచి 60 వేల మందికి పైగా భక్తులు అమ్మవారి దర్శనం కోసం వస్తుంటారు. వచ్చే భక్తులు ఇక్కట్లు పడుతుండటం గమనించిన అప్పటి బీజేడీ ప్రభుత్వం మందిరం అభివృద్ధి కోసం రూ.36 లక్షల నిధులను కేటాయించింది. అనంతరం అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఈ మేరకు మొదటి దశలో రూ.26 కోట్ల నిధులు మంజూరు చేయడంతో పాటు పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు

మందిరం అభివృద్ధి కార్యక్రమాల కోసం మంజూరైన రూ.26కోట్లతో పనులు చేపట్టనున్నట్లు మందిరం మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక తెలియజేశారు. అమ్మవారి దర్శనం కోసం విరివిగా వస్తున్న భక్తుల సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టామని అన్నారు. ముఖ్యంగా యాత్రికుల నివాసం, క్యూలైన్, షాపింగ్ కాంప్లెక్స్, అన్ని సౌకర్యాలతో గల సౌచాలయం, కేశఖండన శాల వంటివి ప్రాథమిక దశలో నిర్మాణం పనులు ప్రారంభిస్తామని వివరించారు. దశల వారీగా నిధులు మంజూరు కానున్న నేపథ్యంలో రెండో దశలో ప్రభుత్వం మంజూరు చేసే నిధులతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటికే అభివృద్ధికి సంబంధించి మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధమైందని తెలిపారు.

క్లుప్తంగా

దీర్ఘాశిలో చైన్‌స్నాచింగ్

పోలాకి: దీర్ఘాశి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో దొంగలు హల్‌చల్ సృష్టించారు. మెండ గడ్డెమ్మ(63) అనే వృద్ధురాలు పశువులకు దాణా పెడుతుండగా వెనక నుంచి వచ్చిన అగంతకుడు బంగారు తాడు (సుమారు పావు తక్కువ మూడు తులాలు) లాక్కొని అక్కడే బైక్‌పై ఉన్న ఇంకో వ్యక్తి సహాయంతో పరారయ్యారు. తాడు లాగే సమయంలో తన నోటిని గట్టిగా మూసివేసినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. సమాచారం అందుకున్న పోలీసులు ఎస్‌ఐ రంజిత్ నేతృత్వంలో చైన్‌స్నాచర్స్ కోసం వేట ముమ్మరం చేశారు. కొందరు అనుమానితులను గుర్తించి విచారిస్తున్నట్లు సమాచారం. నిత్యం రద్దీగా వుండే పోలాకి–నరసన్నపేట రహదారిలో చైన్‌స్నాచర్‌లు పరారైనట్లు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది.

కార్మికులకు అండగా..


కార్మికులకు డీడీ అందిస్తున్న డీసీఎల్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శ్రమదోపిడీకి గురవుతున్న కార్మికులకు కార్మికశాఖ ఉప కార్మిక కమిషనర్ డి.దినేష్‌కుమార్ అండగా నిలిచారు. ప్రత్యేక తనిఖీలు నిర్వహించి శుక్రవారం కార్మికులకు రూ.45514 వేతనాన్ని యాజమాన్యాల నుంచి వసూలు చేసి డి.డి.రూపంలో తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా డీసీఎల్ మాట్లాడుతూ ఈజ్ ఆఫ్ డూయింగ్ ప్రకారం ఆన్‌లైన్‌లో తనిఖీ నిర్వహించాలని వచ్చిన దరఖాస్తుల్ని పరిశీలించగా.. అందులో నలుగురు కార్మికుల వేతనాల్లో తేడాల్ని గమనించామన్నారు. సంబంధిత యజమానుల వద్ద నుంచి తేడా వేతనాన్ని రికవరీ చేసి కార్మికులకు అందించామని చెప్పారు. దీంతో కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: పెద్దరోకళ్లపల్లి పంచాయతీ రామనగరం గ్రామానికి చెందిన బొడ్డు రామన్న (37) అనే వ్యక్తి చెరువులో పడి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్న తన పొలంలో ఎరువులు వేసిన తర్వాత గ్రామ సమీపంలోని చెరువులో స్నానానికి దిగుతుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో మునిగిపోయాడు. కొద్దిసేపటి తర్వాత స్థానికులు గుర్తించి చెరువులో తేలుతున్న రామన్నను బయటకు తీసి టెక్కలి జిల్లాఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రామన్నకు భార్య లత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశారు.

మా సొమ్ము ఎప్పుడు చెల్లిస్తారు?


పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడుతున్న ఖాతాదారులు

ఇచ్ఛాపురం: తాము కష్టపడి సంపాదించుకున్న సొమ్మును తిరిగి చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన తప్పదని ఇచ్ఛాపురం పోస్టాఫీసు వద్ద ఖాతాదారులు స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం పోస్టాఫీసును పరిశీలించేందుకు వచ్చిన పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌ను కలిసి తమ గోడు వినిపించారు. స్కామ్ జరిగి నెలరోజులైనా పోస్టల్ సిబ్బంది పట్టించుకోకపోవడం తగదని ఖాతాదారులు బాలరాజు, సీహెచ్ లోహిదాస్, శ్రీను తదితరులు వాపోయారు.


జాతీయ పోటీలకు కోచ్‌గా అర్జున్‌రావు రెడ్డి


శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ బాస్కెట్‌బాల్ కోచ్ గాలి అర్జున్‌రావు రెడ్డి జాతీయ పోటీలకు కోచ్‌గా నియమితులయ్యారు. పంజాబ్‌లో సెప్టెంబర్ 2 నుంచి జరగనున్న 75వ ఆలిండియా జూనియర్స్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్–2025 పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టుకు కోచ్‌గా వ్యవహరించనున్నారు. ఈ మేరకు శాప్ నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. ఈయన నియామకం పట్ల శ్రీకాకుళం జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేశారు.


7న సంపూర్ణ చంద్రగ్రహణం

అరసవల్లి: సెప్టెంబర్ 7వ తేదీన భాద్రపద శుద్ధ పౌర్ణమి ఆదివారం రాత్రి సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ప్రసిద్ధ సూర్యక్షేత్రం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయం మధ్యాహ్నం 2 గంటల నుంచి మూసివేస్తున్నట్లుగా ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఈఓ కెఎన్‌వీడీవీ ప్రసాద్‌లు తెలియజేశారు. ఆగమశాస్త్ర నిబంధనల ప్రకారం 7వ తేదీ రాత్రి వేళలో గ్రహణ సమయం కావడంతో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సర్వదర్శనాలకు అవకాశమిచ్చి.. అనంతరం భోగసమయం దాటాక అంటే మధ్యాహ్నం 2 గంటలకే ఆలయ ప్రధాన ద్వారాలు మూసివేయనున్నామని వారు వివరించారు. గ్రహణానంతరం ఆలయంలో సంప్రోక్షణ, శుద్ధి కార్యక్రమాల అనంతరం మరుసటి రోజు అనగా 8వ తేదీ సోమవారం ఉదయం 7.30 గంటల నుంచి సర్వదర్శనాలకు అనుమతివ్వనున్నట్లుగా వారు శుక్రవారం ప్రకటించారు. భక్తులు గమనించి గ్రహణ నియమాలను పాటించాలని కోరారు.

గణపతికి ఘనంగా పూజలు


వెటనరీ వీధిలో నెలకొల్పిన కేదారేశ్వర రూపంలోని వినాయకుడు


కేదార్‌నాథ్ ఆలయ రూపంలో మండపం


కలిమెల మైన్‌రోడ్డులో నిలిపిన 15 అడుగుల గణేషుని విగ్రహం


సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రతిష్ఠించిన గణనాథుడు


మల్కన్‌గిరి బటిశాలగూఢ వద్ద పూజలందుకుంటున్న బొజ్జగణపయ్య


ఉత్కళ సమ్మేళన సంఘం సభ్యులు ప్రతిష్ఠించిన గణనాథుడు

మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో పలుచోట్ల వివిధ ఆకారాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో ప్రతిష్ఠించిన గణనాథులు మూడోరోజైన శుక్రవారం విశేష పూజలు అందుకున్నారు. తెల్లవారుజామునుంచే భక్తులు మండపాలకు వెళ్లి భక్తిశ్రద్ధలతో బొజ్జగణపయ్యకు పూజలు చేశారు. స్థానిక వెటనరీ వీధిలో కేదార్‌నాథ్ ఆలయ ఆకారంలో ఏర్పాటు చేసిన మండపంలోని కేదారేశ్వరుడి రూపంలో వినాయకుడి విగ్రహాన్ని అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కలిమెలలో ఏర్పాటు చేసిన 15 అడుగుల వినాయక విగ్రహం భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. మల్కన్‌గిరి గాంధీ యూత్‌క్లబ్ నేతృత్వంలో ఉత్కళ సమేళనంలో, కలెక్టర్ కార్యాలయం వీధిలో ఏర్పాటు చేసిన మండపాలను భక్తులు సందర్శించి పూజలు చేశారు. – మల్కన్‌గిరి

హత్య కేసులో పోలీసుల సీన్ రీ క్రియేషన్


సీన్ రీ క్రియేషన్‌లో భాగంగా నిందితులతో పోలీసులు


మైదానంలో రిక్రియేషన్ సీన్‌లో పోలీసులు

రాయగడ: ఈ నెల 27వ తేదీన స్థానిక మహిళా కళాశాల వెనుక గల హరిజన వీధికి చెందిన రోహిత్ థప్పా హత్య కేసుకు సంబంధించి ఆ పోలీసులు నిందితులను పట్టుకునేందుకు శుక్రవారం నాడు సీన్ రిక్రియేషన్ చేశారు. హత్య కేసుకు సంబంధించి నూతన్ నాయక్, మహేష్ నాయక్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని పట్టుకుని రోహిత్‌ను ఎలా హత్య చేశారు. ఎవరెవరు హత్య చేశారు, ఎలాంటి మరణాయుధాలను వినియోగించారు. మిగతా నిందితులను పట్టుకునే ప్రయత్నంలో భాగంగా ఈ సీన్ రిక్రియేషన్ చేసిన పోలీసులు స్థానిక అగ్నిమాపక కేంద్రం కార్యాలయం వెనుక గల మైదానంలో ఈ తరహా ప్రదర్శన నిర్వహించారు. హత్య చేసిన సమయంలో ఉన్న నిందితులు ఎలా దాడి చేశారు, అదేవిధంగా హత్య చేసిన అనంతరం నిందితులు ఎలా పారిపోయారు అన్న విషయమై పోలీసుల అదుపులో ఉన్న ఇద్దరు నిందితుల ద్వారా పోలీసులు తెలుసుకున్నారు. సీన్ రీ క్రియేషన్‌కు సంబంధించి నిందితులను వెంట తీసుకున్న పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. హత్య కేసులో భాగంగా నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ఈ తరహా సీన్ రీ క్రియేషన్ చేయడం గమనార్హం. అయితే ఇప్పటికే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు హత్యకు సంబంధించిన మిగతా నిందితులను పట్టుకునేందుకు గాలిస్తున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

పల్లెల్లో నువాఖాయ్ వేడుక


తన స్వగృహంలో నువాఖాయ్ బెటగాట్‌లో మాజీ మంత్రి రమేష్ చంద్ర మజ్జి


తన సంప్రదాయ గిరిజన వాయిద్యాలు వాయిస్తున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నిత్యానంద గొండొ

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో నువాఖాయ్ బెట్‌గాట్ ఘనంగా జరుగుతోంది. చేతికి అందిన కొత్త ధాన్యంతో ఉత్సవం ప్రారంభమవుతుంది. కొత్త బియ్యంతో చేసిన వంటలతో పండగ చేసుకుంటారు. తమ ఇష్టమైన ఆరాధ్య దేవతలను పూజలు చేస్తూ సంబరాలు చేసుకుంటూ విందు వినోదాలలో మునుగుతారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి నిత్యానంద గోండో సహచర గిరిజనులతో కలసి గిరిజన సాంస్కృతిక వాయిద్యాలు వాయిస్తూ ఆనందంగా గడిపారు. మాజీ మంత్రి రమేష్ చంద్ర మజ్జి తన స్వగృహం నబరంగ్‌పూర్ జిలా చందాహండి సమితి దండాబడిలో బంధుమిత్రులు, బీజేడీ కార్యకర్తలలో గడిపారు. నబరంగ్‌పూర్ ఎంపీ బలబద్ర మజ్జి తన స్వగ్రామం నబరంగ్‌పూర్ జిల్లా చందాహండి సమితి పటికి లో వ్యవసాయ క్షేత్రాలలో పర్యటించారు. నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి నందాహండి సమితి లో గిరిజనులతో సహ పంక్తి భోజనాల్లో పాల్గొన్నారు.


గిరిజనులతో నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి


స్వగ్రామంలో సొంత వ్యవసాయ క్షేత్రాలలో ఎంపీ బలబద్ర మజ్జి

ఆటో, మ్యాక్సీ డ్రైవర్లను ఆదుకోవాలి


ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో, మ్యాక్సీ డ్రైవర్లు

రణస్థలం: ఉచిత బస్సు పథకం వల్ల ఉపాధి కోల్పోతున్న ఆటో, మ్యాక్సీ డ్రైవర్లకు భృతి ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూ ఏపీ ఆటో, ట్యాక్సీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.వామనమూర్తి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రణస్థలం రామతీర్థం జంక్షన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం ధర్నా నిర్వహించి తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు కిరాయి లేక తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ఫైనాన్స్ కట్టలేక, అప్పులు తీర్చలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డ్రైవర్లకు భారమైన థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, రోడ్ ట్యాక్సీ, టోల్ ఫీజులు 30శాతానికి తగ్గించాలని డిమాండ్ చేశారు. విడి భాగాలపై జీఎస్టీ, వ్యాట్, సెస్ పన్నులు రద్దు చేసి డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. చంద్రబాబు అధికారంలోని వస్తే బ్యాడ్జీ కలిగిన డ్రైవర్లకు సంవత్సరానికి రూ. 15వేలు ఆర్థిక సహాయం చేస్తామని, పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, అనారోగ్యంతో చనిపోతే రూ.5లక్షలు, ప్రమాదంలో చనిపోతే 10లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారని, వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లైసెన్సు కలిగిన ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏటా రూ.25వేలు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కె.శివ, సీఐటీయూ నాయకులు వెలమల రమణ, ఎస్.లక్ష్మణరావు, బి.రామకృష్ణ, బొంతు లక్ష్మణరావు, చిరంజీవి, ఎం.రాముడు, జగదీష్, జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

శ్రీకాకుళం క్రైమ్ : బాలికను మోసగించిన యువకుడిపై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేశామని శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ పి.ఈశ్వరరావు తెలిపారు. కృష్ణా జిల్లా విజయవాడ సమీపంలోని విద్యాధరిపురం ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ కుమార్తె ఇంటర్మీడియట్ సగంలో ఆపేసింది. శ్రీకాకుళం నగరంలోని బాకెర్‌సాహెబ్‌పేటలో తన అమ్మమ్మ ఇంటికి తరచూ వస్తుండేది. ఈ క్రమంలో ఈ ఏడాది మార్చిలో నగరానికి వచ్చిన బాలిక తన ఫోన్ పనిచేయకపోవడంతో దీపామహల్ సమీపంలో సెల్‌ఫోన్ షాపులో ఇచ్చింది. నిర్వాహకుడు వడ్డి శ్యామ్‌సుందరరావుతో పరిచయం ఏర్పడటంతో గర్భం దాల్చింది. దీంతో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

రసాభాసగా మున్సిపల్ సమావేశం

- అధికారుల వైఖరికి నిరసనగా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల వాకౌట్


వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను లోపలికి పిలుస్తున్న కమిషనర్ రామారావు

పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపల్ సాధారణ సమావేశం రసాభాసగా మారింది. పోలీసు పహారా మధ్య మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఈ సమావేశం నుంచి వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు వాకౌట్ చేశారు. గత సమావేశంలో తెలిపిన అంశాలపై తగిన వివరణ ఇవ్వకుండా ఎలా ఈ సమావేశమవుతారని మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, కౌన్సిలర్లు దుర్గాప్రసాద్ పండా, బెల్లాల శ్రీనివాసరావు, పప్పల ప్రసాదరెడ్డి, పిచ్చుక అజయ్, కర్రి మాధవరావు, సవర సోమేశ్వరరావు, బోర చంద్రకళ, దున్న నిర్మల, శార్వాన గీతరవి, దువ్వాడ సత్యవతి, అంబటి మాధురి, పోతనపల్లి ఉమాకుమారి, బల్ల రేవతి, కోఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోస్‌కుమార్ తదితరులు ప్రశ్నించారు. తగిన సమాధానం రాకపోవడంతో వారంతా పోడియం ముందు బైఠాయించి నిరసన తెలియజేశారు. అయినప్పటికీ కమిషనర్ ఎస్.రామారావు నుంచి తగిన సమాధానం రాకపోవడంతో బయటకు వెళ్లి బైఠాయించారు. అప్పటికే సభలో 8మంది సభ్యులు మాత్రమే ఉన్నారు. సమావేశానికి ముందుగా ఈ విషయం తెలియక ముగ్గురు వైఎస్సార్ సీపీ సభ్యులు శిస్టు బృందావతి, జోగి సతీస్‌కుమార్, బోనెల చంద్రమ్మలు రిజిస్టరు పుస్తకంపై సంతకాలు చేశారు.దీంతో మొత్తం 11 మంది సభ్యులు ఉన్నారని కోరం సరిపోయిందని కమిషనరు సమావేశం తూతూమంత్రంగా ముగించేశారు. 37 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించినట్టు తీర్మానాలు చేసుకున్నారు. వార్డుల్లో తమకు సంబంధం లేకుండా పనులు జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిమజ్జనం.. జరభద్రం!

- మొదలైన గణనాథుని అనుపోత్సవం
- చెరువులు, గెడ్డలు, సముద్రం వద్ద జాగ్రత్తలు తప్పనిసరి
- మద్యానికి దూరంగా ఉండాలంటున్న అధికారులు


ఇటువంటి చెరువుల వద్ద నిమజ్జనాల్లో జాగ్రత్తలు అవసరం

టెక్కలి : వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలు మొదలయ్యాయి. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వినాయక చవితి ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన అనుపోత్సవంలో పాల్గొనేందుకు యువకులు పోటీపడుతుంటారు. ఈ సమయంలో కొందరు అత్యుత్సాహంతో వ్యవహరిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. నిమజ్జనం సమయంలో మద్యం సేవించి చెరువుల్లో, కాలువల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకునే పరిస్థితి తెచ్చుకోవద్దని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..

ఇటీవల కురుస్తున్న వర్షాలకు దాదాపు అన్ని చెరువులు, సాగు నీటి కాలువలు నీటితో కళకళలాడుతున్నాయి. ఉపాధి పనులు జరగడంతో చాలావరకు లోతుగా ఉన్నాయి. అది గమనించకుండా రాత్రి సమయాల్లో నిమజ్జనాల్లో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా సముద్రతీరంలో నిమజ్జనాలు మరింత ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు. చిన్నారులను చెరువులు, సాగునీటి కాలువలు, సముద్రతీరాల వద్దకు తీసుకువెళ్లకపోవడం ఉత్తమం. గతంలో జరిగిన కొన్ని సంఘటనలు దృష్టిలో ఉంచుకుని వినాయక నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలని యువకులకు అధికారులు సూచిస్తున్నారు. ఈ విషయంలో ఆయా ఉత్సవ కమిటీ సభ్యులే భాధ్యత వహించాలని ఆదేశాలు చేస్తున్నారు. నిమజ్జనాల్లో కొన్ని రకాల జాగ్రత్త చర్యలు, ఆంక్షలపై టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు, సీఐ విజయకుమార్ తదితరులు ఉత్సవ కమిటీ సభ్యులతో ఇటీవల సమావేశం నిర్వహించి సూచనలు అందజేశారు.



అలా చేస్తే చర్యలు..

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మద్యం సేవించి తగాదాలకు పాల్పడినా, నిమజ్జనాల సమయంలో మద్యం సేవించినా చర్యలు చేపడతాం. మద్యానికి దూరంగా ఉంటూ నిమజ్జనాలు చేస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవు. ఈ విషయంలో నిబంధనలు అతిక్రమిస్తే ఉత్సవ కమిటీ సభ్యులే బాధ్యులవుతారు.

– డి.లక్ష్మణరావు, డీఎస్పీ, టెక్కలి

జాగ్రత్తలు తప్పనిసరి..

- పోలీసులు సూచించిన మార్గంలోనే నిమజ్జన ఊరేగింపు చేయాలి. విగ్రహాన్ని తరలించే వాహనాల సమాచారం ముందస్తుగా అందజేయాలి. డీజే కు అనుమతి తీసుకోవాలి.
- నిమజ్జనం సమయంలో విద్యుత్ తీగల ప్రభావం లేకుండా చూసుకోవాలి.
- నిమజ్జన ఊరేగింపులో వేషధారణలపై ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- మద్యం సేవించి నిమజ్జనాల్లో పాల్గొనేవారిపై కఠినమైన చర్యలు చేపట్టే విధంగా ఆదేశాలు ఉన్నాయి
- పోలీసులు గుర్తించిన సురక్షితమైన ప్రదేశాల్లో మాత్రమే విగ్రహాలను నిమజ్జనం చేయాలి.
- నిమజ్జనాల్లో చిన్న పిల్లలు లేకుండా చూసుకోవాలి.

బస్సులు లేవు.. రైళ్లు రావు!

- ప్రయాణికులకు నరకయాతన
- ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్లలో గంటల తరబడి పడిగాపులు


సోంపేట రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల నిరీక్షణ

శ్రీకాకుళం అర్బన్/కంచిలి: సరిపడా బస్సులు లేక, సకాలంలో రైళ్లు రాక జిల్లా ప్రయాణికులు శుక్రవారం నరకయాతన అనుభవించారు. విజయనగరం వద్ద గూడ్స్ రైలు ప్రమాదం జరగడంతో అటు విశాఖపట్నం నుంచి వచ్చే రైళ్లు, ఇటు భువనేశ్వర్ నుంచి వచ్చే రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఇచ్ఛాపురం, సోంపేట, పలాస, ఆమదాలవలస తదితర అన్ని బస్‌స్టేషన్లతో పాటు జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం కాంప్లెక్స్ కూడా ప్రయాణికులతో రద్దీగా కనిపించింది. దీంతో ఉదయం 9గంటలకు ప్రారంభమైన రద్దీ సాయంత్రం వరకూ కొనసాగింది. వచ్చిన బస్సులు నిండిన వెంటనే వెళ్లిపోవడంతో మిగిలిన ప్రయాణికులు బస్సుల కోసం పడిగాపులు కాశారు. ముఖ్యంగా దూరప్రాంతమైన విశాఖపట్టణం వెళ్లేందుకు అవస్థలు పడ్డారు. మరోవైపు బరంపురం–విశాఖపట్నం, భువనేశ్వర్–విశాఖపట్నం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేయడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. సోంపేట రైల్వేస్టేషన్‌లో ఉదయం 8.26 గంటలకు వచ్చిన ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ 11.30 గంటల వరకు నిలిచిపోయింది. ఆ రైలు కదిలిన తర్వాత అదే ప్లాట్‌ఫాం మీదకు ఇక్కడ స్టాపేజీ లేని షాలిమర్–వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్ వచ్చింది. ఇది కూడా మధ్యాహ్నం 3 గంటల వరకు నిలిచిపోయింది. ఉదయం 9.20 గంటలకు రావల్సిన కోల్‌కత్తా–చెన్నై మెయిల్ మధ్యాహ్నం 3–50 గంటలకు వచ్చింది. ఇక భువనేశ్వర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే విశాఖ ఎక్స్‌ప్రెస్ ఉదయం 11.45కి రావల్సి ఉండగా.. సాయంత్రం 4.20 గంటలకు వచ్చిందని సోంపేట రైల్వేస్టేషన్ మేనేజర్ సత్యనారాయణ బెహరా తెలిపారు.


శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

క్లుప్తంగా

ఆధునిక పరిశోధనలకు గిరిజన జ్ఞానం దోహదం

- గిరిజన యూనివర్సిటీలో పద్మశ్రీ చెరువాయల్ రామన్

విజయనగరం అర్బన్: గిరిజన జ్ఞాన సంపదను ఆధునిక పరిశోధనలతో అనుసంధానం చేయడం సమగ్ర సమాజ నిర్మాణానికి కీలకమని పద్మశ్రీ చెరువాయల్ రామన్ అన్నారు. స్థానిక కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలో ధర్తి ఆబా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకొని 'గిరిజన జ్ఞాన వ్యవస్థ : సర్దుబాటు మరియు సమగ్రత' అనే అంశంపై శుక్రవారం జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు సంప్రదాయ వ్యవసాయం, మూలికా వైద్యం, ప్రకృతి వైద్య విధానాలు శాస్త్రీయంగా అభివృద్ధి చెందితే సమాజానికి మరింత మేలు చేస్తాయని సూచించారు. అనంతరం ఆయన్ని యూనివర్సిటీ ఘనంగా సత్కరించింది. విద్యార్థులు ప్రదర్శించిన థింసా నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్రమోహన్ మిశ్రా, డాక్టర్ సీత కక్కోత్, ప్రొఫెసర్ శరత్ చంద్రబాబు, డాక్టర్ నగేష్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడిన ముగ్గురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమణ, పక్కన ఎస్ఐ

బొండపల్లి: మండలంలోని కనిమెరక గ్రామ సమీపంలో శుక్రవారం ఉదయం 10గంటల సమయంలో బ్యాగ్‌లతో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని సోదా చేయగా వారి బ్యాగ్‌ల్లో మూడు కేజీల ఆరు వందల గ్రాముల గంజాయి గుర్తించినట్టు గజపతినగరం సీఐ రమణ శుక్రవారం తెలిపారు. రాయగడ నుంచి బ్యాగ్‌ల్లో కొత్తపాలెం గ్రామానికి చెందిన బండారు రాము, పద్మనాభ మండలం బొత్సపేటకు చెందిన గణేష్, మరో నిందితుడు జూనేయల్ బ్యాగ్‌ల్లో కేజీ 200గ్రాములు చొప్పున మూడు కేజీల ఆరు వందల గ్రాములు గంజాయిని తీసుకువచ్చి గ్రామాలలో వినాయక నిమజ్జనాల సందర్భంగా యువకులకు సరఫరా చేయడానికి తీసుకువస్తున్నట్టు సమాచారం అందిందని చెప్పారు. అందిన సమాచారం మేరకు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ యు.మహేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గిడుగు సేవలు మరువలేనివి



తెలుగు వేషధారణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

నెల్లిమర్ల: గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగు భాషకు చేసిన సేవలు మరువలేనివని డైట్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణారావు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయ విద్య శిక్షణా సంస్థ (డైట్)లో తెలుగు భాష దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమ నేత గిడుగు రామ్మూర్తి పంతులు, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ రామకృష్ణారావు మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగు భాషకు చేసిన సేవలు మరువలేనివన్నారు. ముఖ్యంగా ఆయన ఉత్తరాంధ్ర వాడుక భాషనే కాకుండా వ్యవహారిక భాష ఉద్యమం చేపట్టి పల్లె ప్రజలు, నిరక్ష్యరాస్యులకు అర్థమయ్యేలా పాలకుల్లో మార్పు తీసుకు వచ్చిన ఘనత గిడుగుకి దక్కుతుందని, సవర భాషకు లిపిని తయారు చేసి మన్యం గిరిజనుల బతుకుల్లో వెలుగు నింపారని గుర్తు చేశారు. అనంతరం జాతీయ క్రీడా దినోత్సవంపై మాట్లాడుతూ మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినం సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహిస్తున్నామని ధ్యాన్‌చంద్ హాకీలో ఒలింపిక్ పోటీల్లో బంగారు పతకం సాధించి దేశానికి పేరు తీసుకు వచ్చారని గుర్తు చేశారు. భువన విజయం, కన్యాశుల్కం ప్రదర్శించారు. కార్యక్రమంలో తెలుగు విభాగం ఉపన్యాసకులు కంచుపల్లి అప్పారావు, పతివాడ సూర్యారావు, కాళ్ల అప్పారావు, స్టాఫ్ సెక్రటరీ వి.చిన్నం నాయుడు, సూపరింటెండెంట్ కమల కుమారి తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 3న పార్వతీపురంలో జాబ్‌మేళా

పార్వతీపురం టౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వచ్చేనెల 3వ తేదీన పార్వతీపురంలోని శ్రీసాయిరాం డిగ్రీ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి జాబ్ మేళా నిర్వహిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ చదువుకొని 18 నుంచి 30 ఏళ్ల లోపు వయసుగల నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్ మేళాకు హాజరుకావాలన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను జ్ఞ ఇటు:// ఙుజీ ఇఙిఙ్రియు.ు ఇజౌౌ.జీ ు వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని, రిఫరెన్స్ నంబర్‌తో పాటు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జెరాక్స్, ఒక పాస్ ఫొటోతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్: 91772 97528, 89788 78557 నంబర్లను సంప్రదించాలన్నారు.

సర్వజన ఆసుపత్రిలో రోగుల కష్టాలు..!

- రాత్రి వేళ మరింత కష్టాలు
- స్పెషాల్టీ వైద్యులు అందుబాటులో ఉండని వైనం
- అధిక శాతం వైద్యులు విశాఖ నుంచి రాకపోకలు
- రిఫరల్స్ ఎక్కువగా చేస్తున్నారనే ఆరోపణలు



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి

☛ బొండపల్లి మండలానికి చెందిన కృష్ణ అనే వ్యక్తికి కడుపు నొప్పి రావడంతో వారి బంధువులు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తెల్లవారుజామున 5 గంటల సమయంలో తీసుకువెళ్లారు. సంబంధిత స్పెషాల్టీ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో క్యాజువాలటీ వైద్యులే సేవలు అందించారు. అల్ట్రాసౌండ్ స్కాన్ అత్యవసరం అయినప్పటికీ ఉదయం 10 గంటల వరకు నొప్పితోనే నిరీక్షించాల్సిన పరిస్థితి.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సకాలంలో రోగులకు వైద్య సేవలు అందక అవస్థలు పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఇక్కడ వైద్య సేవలు అందించేగలిగే వాటిని కూడా వైద్యులు కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా రాత్రి వేళ చాలా వైద్య సేవలు గగనంగా మారాయనే అపవాదు ఉంది.

విశాఖ నుంచి రాక పోకలు

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వైద్యులంతా స్థానికంగా ఉండాలి. కానీ అధిక శాతం మంది వైద్యులు విశాఖపట్నం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం అందరూ స్థానికంగా ఉండాలి. ఎందుకంటే వీరు హోమ్ రెంట్ అలవెన్స్ (హెచ్ఆర్ఏ) తీసుకుంటున్నారు. అయితే ఇక్కడ ఉండకపోయినప్పటికీ తప్పుడు అడ్రస్‌లు చూపించి హెచ్ఆర్ఏ పొందుతున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా స్పెషాల్టీ వైద్యులు అవసరం ఎంతో ఉంటుంది. రోగులు ప్రాణాలు కాపాడడంలో వీరిదే ప్రధాన పాత్ర. వీరు అందుబాటులో ఉంటే రోగులకు సకాలంలో వైద్యం అందించడానికి వీలుంటుంది.

రాత్రి సమయంలో అందుబాటులో ఉండని స్పెషాల్టీ వైద్యులు

రాత్రి పూట స్పెషాల్టీ వైద్యులు అందుబాటులో ఉండడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎంబీబీఎస్ వైద్యులు, పీజీ వైద్యులే రోగులకు పెద్దదిక్కుగా నిలుస్తున్నారు. వాస్తవంగా స్పెషాల్టీ వైద్యులు రాత్రి వేల ఆసుపత్రిలో ఉండాలి. కానీ గత కొంత కాలంగా స్పెషాల్టీ వైద్యులు ఉండడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రిఫరల్స్ ఎక్కువగా చేస్తున్నారనే ఆరోపణలు

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వైద్యం అందించే గలిగే పరిస్థితి ఉన్నప్పటికీ కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో ఎక్కువగా రిఫరల్స్ చేస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. స్పెషాల్టీ వైద్యులు రాత్రి సమయంలో అందుబాటులో లేకపోవడం వల్ల తమకెందుకు వచ్చిన రిస్క్ అనుకుని రిఫర్ చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతీ రోజు ఇక్కడి ఆసుపత్రి నుంచి మూడు నుంచి నాలుగు రిఫరల్స్ చేస్తున్నట్టు తెలుస్తుంది.

సాయంత్రం 4 గంటల తరువాత అందని అల్ట్రా సౌండ్ సేవలు

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సాయంత్రం 4 గంటల తర్వాత అల్ట్రాసౌండ్ స్కాన్ సేవలు అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి పూట తీవ్రమైన కడుపునొప్పి, కడుపులో తీవ్రమైన మంటతో వచ్చే వారికి అత్యవసరంగా అల్ట్రాసౌండ్ చేయాల్సి ఉంటుంది. ఈ సమయంలో వైద్యులు అందుబాటులో లేక పోవడం వల్ల మరుసటి రోజు ఉదయం 9, 10 గంటలకు వైద్యులు వచ్చే వరకు నొప్పితోనే రోగులు నిరీక్షించాల్సిన పరిస్థితి.

1200 వరకు ఓపీ

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఓపీకి 1000 నుంచి 1200 మంది వరకు రోగులు వస్తున్నారు. అదే విధంగా 60 నుంచి 80 మంది వరకు ఇన్‌పేషంట్లుగా రోగులు చేరుతున్నారు.

రిఫర్ చేస్తే చర్యలు తీసుకుంటాం..

ఆసుపత్రిలో చికిత్స చేయగలిగే రోగులకు ఇక్కడే సేవలు అందిస్తారు. చికిత్స అందివ్వగలిగే వారిని రిఫర్ చేస్తే చర్యలు తీసుకుంటాం. రాత్రి సమయంలో జనరల్ మెడిసిన్, జనరల్ ఫిజీషియన్ విధులు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చాం. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటాం. అల్ట్రాసౌండ్ స్కాన్ అత్యవసరం అనుకుంటే వైద్యులు వచ్చి స్కాన్ చేయాలి. ఆ విధంగా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ సంబంగి అప్పలనాయుడు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి

ఇక ఆన్‌లైన్‌లో రిమాండ్ ఖైదీల విచారణ

- జైళ్ల అధికారి మధుబాబు



మాట్లాడుతున్న జిల్లా జైళ్ల అధికారి మధుబాబు

బొబ్బిలి: రిమాండ్‌లో ఉన్న ఖైదీలను జైలు నుంచి కోర్టులకు తరలించే సమయంలో భద్రత, సమయం, తరలింపు తదితర అంశాలను మరింత మెరుగు పర్చుకునే క్రమంలో కొన్ని మార్పులు చేసినట్టు జిల్లా జైళ్ల అధికారి జి.మధుబాబు తెలిపారు. స్థానిక సబ్ జైలును శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. రిమాండ్ ఖైదీల విచారణ సమయంలో కోర్టులకు తరలించే వ్యయ, ప్రయాసలను తగ్గించేందుకు, మరింత సులువుగా మెరుగైన ప్రక్రియ నేపథ్యంలో ఆన్‌లైన్‌లోనే వారి కేసులను విచారించేందుకు ఉన్నత న్యాయమూర్తుల ఆదేశాల మేరకు జైళ్లలో తగు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. అలాగే ఉమ్మడి జిల్లాలోని విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, ఎస్.కోట, చీపురుపల్లి సబ్ జైళ్లలో 150 మంది వరకూ వివిధ కేసులకు సంబంధించి రిమాండ్ ఖైదీలున్నారన్నారు. ఇవి నడుస్తున్న భవనాలు బ్రిటిష్ కాలం నాటివి కావడంతో కొత్త భవనాల నిర్మాణం కోసం అవసరమైన స్థలాల గుర్తింపునకు రెవెన్యూ అధికారులకు ప్రతిపాదించినట్టు చెప్పారు. జిల్లా జైలు కోసం సారిక వద్ద ఏడెకరాలను, బొబ్బిలి సబ్ జైలు కోసం గ్రోత్‌సెంటర్ వద్ద ఐదెకరాలను గుర్తించామన్నారు. మిగతా సబ్‌జైళ్ల స్థలాలు కూడా గుర్తిస్తే భవన నిర్మాణాలకు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదిస్తామన్నారు. సబ్ జైలర్ పాత్రో, సిబ్బంది ఉన్నారు.

ఆఫ్‌లైన్ పద్ధతిలో ముగిసిన బార్ లాటరీ ప్రక్రియ

విజయనగరం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన బార్ పాలసీ 2025-28లో దరఖాస్తుల ప్రక్రియ శుక్రవారం సాయంత్రం 5 గంటలతో ఆఫ్‌లైన్ పద్ధతి ముగిసిందని, 30న ఓపెన్ కేటగిరి, గీత కులాలు సంబంధించిన బార్లు లాటరీ పద్ధతిలో కలెక్టర్ సమక్షంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎంపిక నిర్వహిస్తామని జిల్లా మద్యనిషేధ, అబ్కారి శాఖ అధికారి బి.శ్రీనాథుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఓపెన్ క్యాటగిరి బార్లు 51 దరఖాస్తులు, గీత కులాలు మూడుబార్లు 21 దరఖాస్తులు, పార్వతీపురం మన్యం జిల్లాలో ఓపెన్ క్యాటగిరి బార్ తొమ్మిది దరఖాస్తులు, గీతకులాల బార్ పది అప్లికేషన్లు స్వీకరించామన్నారు. ఒక బారుకు నాలుగు కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చిన విజయనగరంలో 14 బార్లు, పార్వతీపురం జిల్లాలో నాలుగు బార్లుకు లాటరీ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు.

గూడ్స్ రైలు ఢీకొని యువకుడి మృతి



రైలు ఢీకొని మృతి చెందిన యువకుడు శంకరావు

బొండపల్లి: మండలంలోని కనిమెరక రైల్వే గేటుకు సమీపంలో రైల్వేట్రాక్ దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి బొబ్బిలి రైల్వే హెచ్‌సీ ఈశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దత్తిరాజేరు మండలంలోని వింద్యావాసి గ్రామానికి చెందిన టి.శంకరరావు (26) రైల్వే ట్రాక్ దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొనడంతో మృతి చెందినట్టు తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పాముకాటుతో మహిళ..



మృతురాలు కొత్తమ్మ

గంట్యాడ: పాముకాటుతో ఓ మహిళ మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని దిగువ కొండపర్తి గ్రామానికి చెందిన ఎర్రబోయిన కొత్తమ్మ (40) తాను నివసిస్తున్న పూరి గుడిసెలో గుర్తు తెలియని పాము కాటు వేయడంతో మరణించింది. దీనిపై ఫిర్యాదు అందడంతో గంట్యాడ పోలీసులు మృతదేహాన్ని ఎస్.కోట ఏరియా ఆసుపత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించారు. మృతురాలికి 16 ఏళ్ల వయసు గల కుమార్తె ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లభ్యం కాని మత్స్యకారుడి ఆచూకీ

పాచిపెంట: చేపల వేటకు ఈ నెల 27న వెళ్లి పెద్దగెడ్డ జలాశయంలో గల్లంతైన మండలంలోని కోడికాళ్లవలస గ్రామానికి చెందిన గిరిజన మత్స్యకారుడు జన్ని బాలరాజు ఆచూకీ శుక్రవారం కూడా లభ్యం కాలేదు. ఎస్ఐ వెంకటసురేష్ నేతృత్వంలో పెద్దగెడ్డ జలాశయంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి పడవల్లో శుక్రవారం సాయంత్రం ఆరు గంటల వరకు గాలింపు చర్యలు చేపట్టారు. బాలరాజు ఆచూకీ లభ్యం కాకపోవడంతో శనివారం కూడా గాలింపు చేపడతామని ఎస్ఐ తెలిపారు.

మూడు రెట్లు పెరిగిన గంజాయి కేసులు

- గంజాయి రవాణాపై గట్టి నిఘా
- ఎస్పీ వకుల్ జిందల్



సీతంపేట: రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ



బొబ్బిలి: పట్టుబడిన వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ, డీఎస్పీ, సీఐలు

బొబ్బిలి: జిల్లాలో గంజాయి రవాణా నిరోధించేందుకు గట్టి నిఘా ఉంచామని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఆయన శుక్రవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత ఏడాదితో పోలిస్తే గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన కేసులు మూడు రెట్లు పెరిగాయన్నారు. అలాగే అరెస్టులు నాలుగు రెట్లు పెరిగాయన్నారు. ఇప్పటికే అరెస్టయిన వారి నుంచి రూ.కోట్ల విలువైన ఆస్తులను ఫ్రీజ్ చేశామన్నారు. గంజాయి రవాణా చేసిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్టు చెప్పారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలు ఆన్‌లైన్ లోన్ యాప్‌లను ఓపెన్ చేయొద్దన్నారు. యాప్‌లలో రుణం తీసుకుంటే అసలు కన్నా అధిక రెట్ల వడ్డీ చెల్లించాల్సి వస్తుందన్నారు. అలాగే ఆన్‌లైన్‌లో మీకు లక్షలాది రూపాయల లాటరీ వచ్చిందని, మీరు రూ.కొంత సొమ్ము కడితే మిగతా సొమ్ముతో పాటు చెల్లిస్తామని చెప్పి పత్తా లేకుండా పోతారన్నారు. దీని వలన ప్రజలు ఆర్థికంగా నష్టపోతారన్నారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని కంప్యూటర్ విభాగాన్ని, సీసీ కెమెరాల కంట్రోల్ విభాగాన్ని పరిశీలించారు. వివిధ కేసుల్లో పట్టుబడ్డ బైక్‌లను పరిశీలించారు. వాటి వివరాలను డీఎస్పీ జి భవ్యారెడ్డి, సీఐలు కె.సతీష్ కుమార్, నారాయణరావులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసుస్టేషన్లో గౌరవ వందనం స్వీకరించారు. ఎస్ఐలు ఆర్.రమేష్‌కుమార్, పి.జ్ఞానప్రసాద్, ఏఎస్ఐ డి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

దోనుబాయి పీఎస్‌ను సందర్శించిన ఎస్పీ

సీతంపేట: దోనుబాయి పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ మాధవరెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణను, రికార్డులు పరిశీలించారు. సైబర్ క్రైం, రహదారి ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గణేష్ చతుర్థిని పురస్కరించుకుని ఊరేగింపుల్లో ఎటువంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా చూడాలన్నారు. కాగా దోనుబాయి ప్రాంతంలో ఒక ఆర్ఎంపీ డాక్టర్ పలు అక్రమాలకు పాల్పడుతున్నాడంటూ, ఆయనపై చర్యలు తీసుకోకపోతే నూతన నక్సలిజం పార్టీ త్వరలో జనంలోకి వస్తాదంటూ స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్టు దోనుబాయి యూత్ పేరిట ఓ లేఖ సోషల్ మీడియాలో శుక్రవారం హల్‌చల్ చేసింది. దీనిపై ఎస్పీ ఆరా తీసినట్టు తెలిసింది. తహసీల్దార్ శ్రీకన్య వద్ద ఈ విషయమై ప్రస్తావించగా దీనిపై ఆర్ఐను విచారణకు నియమించామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్‌మస్తాన్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో అప్పీల్ చేసుకున్న వారికి పింఛన్

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం రూరల్: 40 శాతం పైగా అంగ వైకల్యం ఉన్న వారికి నోటీసులు జారీ చేయడం జరిగిందని తదనుగుణంగా ఆన్‌లైన్‌లో అప్పీల్ చేసుకున్న వారికి పింఛన్ పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన అపీల్‌ను విధిగా అధికారులు ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు గ్రామాల్లో స్పష్టమైన అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు.

కౌశలంలో అప్‌లోడ్ చేయాలి

నిరుద్యోగ యువతీ యువకులు వివరాలను కౌశలం పోర్టల్‌లో నమోదు చేయాలని కలెక్టర్ శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ధ్రువీకరణ పత్రాలు ఈ మెయిల్, మొబైల్ వివరాలను నమోదు చేయాలని ఆయన తెలిపారు. నమోదు చేసిన అభ్యర్థులకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి, డీఎంహెచ్‌వో డా. ఎస్.భాస్కరరావు, డీసీహెచ్ డా.నాగభూషణరావు, ఎస్‌డీసీ దిలీప్ చక్రవర్తి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ప్రకృతి వ్యవసాయం సాగు పెంచడానికి రైతులకు అవగాహన కల్గించాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించారు. ప్రస్తుతం సాగు చేస్తున్న రైతులు కాకుండా కొత్త గ్రామాల్లో సర్వే చేసి కొత్త రైతులను గుర్తించి వచ్చే రబీ నుంచి సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన చాంబర్‌లో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. మండల స్థాయిలో 3 రోజులు పాటు సమావేశాలు ఏర్పాటు చేయాలని, తదుపరి గ్రామ స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో పాటు, మండల స్థాయి ప్రత్యేకాధికారులను డ్వాక్రా మహిళలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలన్నారు. ర్యాలీలు నిర్వహించాలని, ఎగ్జిబిషన్ ప్రదర్శనలను నిర్వహించి ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించాలన్నారు. రైతుల నుంచి సలహాలు, సూచనలను కూడా తీసుకోవాలన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని వీటిన్నటిని నమోదు చేసి డాక్యుమెంటరీని తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం సాగుకు ముందుకు వచ్చిన వారి జాబితాను తీసుకుని అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు రుపొందించాలని అన్నారు. జిల్లాలో గుర్తించిన 290 క్లస్టర్‌లో బేసిక్ సర్వే ప్రారంభించాలన్నారు. సమావేశంలో జేసీ సేతు మాధవన్, జిల్లా వ్యవసాయ అధికారి తారాకరామారావు, డీపీఎం ఆనందరావు, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, మత్స్య శాఖ డి.డి విజయ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలు పక్కదోవ పట్టిస్తే చర్యలు

- స్త్రీనిధి జిల్లా ఏజీఎం కామరాజు
- సాక్షి ఎఫెక్ట్



మాట్లాడుతున్న స్త్రీనిధి ఏజీఎం కామరాజు


వెలుగులో చీకటి కోణం

ఈ నెల 27న సాక్షిలో వచ్చిన కథనం

వీరఘట్టం: గ్రామ సంఘాల నుంచి రికవరీ చేస్తున్న స్త్రీ నిధి రుణాలను పక్కదోవ పట్టిస్తున్నారని ఈ నెల 27న సాక్షిలో ప్రచురితమైన 'వెలుగులో చీకటి కోణం' కథనంపై వెలుగు జిల్లా యంత్రాంగం స్పందించింది. స్త్రీనిధి జిల్లా ఏజీఎం పి.కామరాజు వీరఘట్టం వెలుగు కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. స్త్రీనిధి రుణాల తీసుకున్న గ్రూపుల వివరాలు, వారు ఎంతెంత కట్టారో తదితర వివరాలు పరిశీలించారు. స్త్రీనిధి రుణాలను సొంత అవసరాలకు వాడుకున్న రేగులపాడు వీవోఏ నుంచి రూ.60 వేలు రికవరీ చేశామన్నారు. మిగిలిన సొమ్ము రెండు రోజుల్లో చెల్లించాలని ఆమెకు సూచించారు. ఈ సందర్భంగా ఏజీఎం మాట్లాడుతూ స్త్రీ నిధి రుణాలు పక్కదోవ పట్టిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని డ్వాక్రా గ్రూపులకు రూ.86 కోట్లు స్త్రీ నిధి ద్వారా రుణాలు ఇచ్చేందుకు లక్ష్యంగా చేసుకున్నామని, ఇంత వరకు రూ.21 కోట్లు రుణాలు మంజూరు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా మొండి బకాయిలు ఉన్న 21 గ్రామ సంఘాలు ఉన్నాయని, వీరి నుంచి రూ.48 లక్షలు వసూలు చేయాల్సి ఉందన్నారు. ఆయనతో పాటు స్త్రీనిధి మేనేజర్ బి.ప్రసన్నకుమార్, ఏపీఎం కె.రాము ఉన్నారు.

నిందితుడి భార్య ఆత్మహత్యా యత్నం



జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హేమలత

పార్వతీపురం రూరల్/మక్కువ: తన తల్లిపై దాడి చేసేందుకు వచ్చే క్రమంలో నిందితుడు ఆదినారాయణ పదునైన ఆయుధంతో పొడవడంతో ప్రాణాలు పోగొట్టుకున్న మృతుడు సాగరాపు కార్తీక్ ఘటన పాఠకులకు విదితమే. అయితే ఈ క్రమంలో శుక్రవారం ఈ కేసు దర్యాప్తు నిమిత్తం మక్కువ పోలీసులు నిందితుని ఇంటి వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తున్న క్రమంలో మృతుని తల్లి దమయంతి నిందితుడి భార్య హేమలత వైపు కోపంగా చూసిన కారణంతో భయాందోళన చెంది ఇంట్లో వున్న జొన్నచేళ్లకు ఉపయోగించే పురుగుల మందును తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. దీన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు మక్కువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం తరలించారు. అనంతరం పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించినట్టు ఈ మేరకు వివరాలు సేకరించినట్టు జిల్లా కేంద్ర ఆసుపత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి జైలుశిక్ష

విజయనగరం క్రైమ్ : స్థానిక మహిళా పోలీసుస్టేషన్‌లో 2024లో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి పోక్సో ప్రత్యేక కోర్టు 20 సంవత్సరాల కారాగార శిక్ష విధించింది. దీనికి సంబంధించి ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం తెలిపిన వివరాలు.. విజయనగరం హుకుంపేటకు చెందిన పెంకి వివేక్(25)కు 14 ఏళ్ల బాలిక నగరంలోని అంబటిసత్రం వద్ద ఓ చర్చికి వెళ్లే సమయంలో పరిచయమైంది. సదరు బాలిక ఆరోగ్యం తరచూ బాగుండకపోవడంతో వివేక్ వారింటికి వెళ్లి సహాయపడేవాడు. ఈ క్రమంలో బాలిక కుటుంబ సభ్యులు వివేక్‌ను పూర్తిగా నమ్మడంతో పాపను కొద్ది రోజులు ఒంటరిగా ఉంచితే ఆరోగ్యం కుదుటపడుతుందని నమ్మించాడు. పక్కా పథకం ప్రకారం బాలికను అంబటివలసలో ఒక ఇల్లు తీసి అక్కడ బాలికను ఉంచి ఆమె ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్టు వివేక్ అందరిని నమ్మించాడు. బాలికను లోబర్చుకొని శారీరకంగా అనుభవించి కొన్ని వీడియోలు, ఫొటోలు తీసి భయపెట్టసాగాడు. విషయం కాస్త బాలిక తల్లికి తెలిసి విజయనగరం మహిళా పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ ఎన్.పద్మావతి నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారని ఎస్పీ తెలిపారు. అప్పటి మహిళా పీఎస్ ఇన్‌చార్జి డీఎస్పీ డి.విశ్వనాథ్ దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి అభియోగ పత్రం దాఖలు చేశారని పేర్కొన్నారు. కేసు నమోదైన ఏడాదిన్నరలోనే ప్రాసిక్యూషన్ పూర్తయ్యే విధంగా ప్రస్తుత డీఎస్పీ ఆర్.గోవిందరావు చర్యలు చేపట్టారని తెలిపారు. కోర్టులో నిందితుడిపై నేరారోపణలు రుజువు కావడంతో విజయనగరం స్పెషల్ జడ్జి ఫర్ పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.నాగమణి నిందితుడికి 20 ఏళ్లు కఠిన కారాగారం, రూ.4వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో బాధితురాలికి పరిహారంగా రూ.5లక్షలు మంజూరు చేస్తూ న్యాయమూర్తి తీర్పును వెల్లడించారన్నారు. నిందితుడిపై నేరం నిరూపణ అయ్యే విధంగా పోలీసుల తరపున పోక్సో కోర్టు ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెట్ట ఖజానారావు వాదనలు వినిపించారు. డీఎస్పీ ఆర్.గోవిందరావు పర్యవేక్షణలో సీఎంఎస్ హెచ్‌సీ సీహెచ్ రామకృష్ణ, మహిళా పీఎస్ హెచ్‌సీ కె.అప్పలనాయుడు, కానిస్టేబుల్ సూరపునాయుడు సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరిచారని తెలిపారు.

తెలుగు భాషను పరిరక్షించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం రూరల్: తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, తెలుగు భాష చిరస్థాయిగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆకాంక్షించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన తెలుగుభాష దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి వాడుక భాష ఉద్యమానికి చేసిన కృషిని కొనియాడారు. విద్యార్థుల కోసం వచ్చేనెల 5న తెలుగు మాస పత్రికను విడుదల చేస్తామని, అందులో విద్యార్థులకు అవసరమైన సమాచారంతోపాటు రచనలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో చిన్నారుల నృత్యప్రదర్శనలు అలరించాయి. ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి వై.నాగేశ్వరరావు, ఎస్ఎస్ఏ ఏపీసీ తేజేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.